
# స్వకీయం!

రచన : "శశితేన్"



చినుకులు చిటపటమంటూ ఆగాగి పడుతున్నాయి. ఒకటే

చిరాకుగా వుంది. అటు రాకుండా, ఇటు పోకుండా ఇలాంటి వర్షం ఎవరికి మేలుచేసేది! నాలో నేను తిట్టుకున్నాను వర్షాన్ని. జేబులోనుండి కర్చీప్ తీసి తలపై కప్పుకుంటూ మృణాళిని ఇంటివైపు చూశాను. తలుపులు దగ్గరికి వేసున్నాయి. సాధారణంగా ఆవిడెప్పుడు ఇంట్లో వున్నా తలుపులు గట్టిగా బిడాయించుకుని మరీ లోపల కూర్చుంటుంది. అంత బోర్ కొట్టినా ఆఫీస్ కాగానే ఎంత సేపయినా ఇంట్లో ఓపిగ్గా కూర్చుని ఏం చేస్తుందో అనే ఆలోచన నాకు వచ్చినా 'మనకెందుకులే' అనుకునేవాడ్ని.

పైన చూస్తే వర్షం కుండపోతగా వస్తుందన్నట్లు క్రమ్ముకుంటున్నాయి మేఘాలు! సరే ఇంటికివెళ్ళి మాత్రం చేసేదేముంది అనుకుంటూ తలుపు తట్టాను. లోపల ఫాన్ గాలికి వినబడలేదేమోనని మరోసారి ధబీమని బాదాను ఏ రెస్పాన్స్ లేకపోవడంతో.

ఆవిడొచ్చి తలుపు తీసింది. వెళ్ళి కుర్చీలో కూర్చుంటు చూశాను. ఓ అపరిచితుడు. అయినా ఎక్కడో లీలగా చూసిన గుర్తు. బహుశా ఏ బజార్లో చూసివుంటానో అనుకున్నాను. అతగాడు నన్నుచూసి కాస్తా ఇబ్బందిగా—ఫీలయి సర్దుకున్నాడు. మృణాళిని పనిచేసే షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగి కావొచ్చునేమో! అవిడ ఉద్యోగరీత్యా ఈ వూరొచ్చి అయిదారు నెలలు నిండివుండవచ్చు. స్వగ్రామ స్థలమనే నెలవుమీద అప్పుడప్పుడు ఆవిడని సందర్శించి క్షేమసమాచారాలు కనుక్కుంటుంటాను నేను.

కాసేపు నిశ్శబ్దం ఆవరించింది మా ముగ్గురి మధ్య. నేనూ అడగలేదు అతగాడెవరని. అయితే నా మొహంలోకి రెండు మూడుసార్లు బాగా గమనిస్తున్నట్లుగా చూశాడు. అలాగెందుకు చేశాడో నా కర్థంగాక, 'అయితే ఏమిటిః' అన్నట్టు ఓ ఫోజుపెట్టి కూర్చున్నాను. కాసేపాగి మృణాళినితో మాట్లాడటం మొదలుపెట్టాడు. వాళ్ళ సంభాషణలో స్టాప్ గురించి, జి.ఎం. గురించి అతడిగాడి భార్య గురించి విషయాలు దొర్లాయి.

ఏదో మాగజైన్ తీసి సైలెంట్‌గా చదవడం మొదలు పెట్టాను వాళ్ళకి డిస్టర్బెన్స్ కలిగించడం ఎందుకులే అని. పావు గంటసేపు మాట్లాడాడు పిచ్చాపాటిగా. వాళ్ళ మాటల్లో కొన్ని నవ్వు తెప్పించినా అదుముకున్నాను పెదాలతో! చివరికి మృణాళిని ఏమనుకుందో ఏమో తనే ఫార్వర్డ్ అయి అంది.

'కౌసల్యతో చెప్పి వచ్చారా' అని. కౌసల్య అంటే అతగాడి భార్య అయివుండవచ్చుననుకున్నాను. ఆ మాటని తను విననట్టే నటిస్తూ కుర్చీలోంచి లేచి పుస్తకాల రాక్ లో నుంచి రెండు మూడు పుస్తకాలు తీసి హెడ్డింగ్స్ చూస్తూ 'ఈ పుస్తకాలు లైబ్రరీవా!'

ఈడ్చి కొట్టాలనిపించింది నాకు. ఎవరివైతే ఈయనకెందుకు! 'కాదు ఆ అబ్బాయివి' నాకేసి చూపిస్తూ అందావిడ.

అయితే ఈసారి అతడు నాకేసి చూడలేదు. పుస్తకాల విషయం అయిందన్నట్టు వాటిని వదిలి ఇన్‌కంప్లీట్‌గా

పుస్తు వెనక రూమ్‌ని చూస్తూ 'ఈ రూమ్ కూడా పూర్తయితే బాగుంటుంది' అన్నాడు.

'అంత ఇదుంటే వేయించరాదా' అనుకున్నాను లోపలే!

అప్పుడే టైం తొమ్మిది కావొస్తున్నది. ఇంకా వెళ్ళడా ఏమిటి? అనుకుంటూ అంది మృణాళిని. అయినా ఆ మనిషిలో అలాంటి ఆలోచన లేదనిపిస్తుంది. చివరి అస్త్రంగా 'ఇహ మీరు వెళితే బాగుంటుందేమో వర్షం కూడా పెద్దదయ్యేట్టుగా వుంది' అంది.

తప్పదనుకున్నాడో ఏమో అతి ప్రయత్నంమీద వెళ్ళలేక వెడుతున్నట్టుగా ఒకడుగు ముందుకేస్తూ మళ్ళీ అటూ యిటూ చూస్తూ అరుగుమీద పెట్టాడు కాలు! మర్యాద కోసమన్నట్టు మృణాళిని కూడ బయటి దాకా వెళ్ళింది.

'ఏమిటి అంటున్నాడు' లోపలి కొచ్చిన మృణాళిని అడిగాను.

'మరేంలేదు! నువ్వెవరని అడుగుతున్నాడు.'

'అనుకున్నాను' నవ్వుతు అన్నాను.

'ఎందుకలా' ప్రశ్నార్థకంగా చూస్తూ అంది.

'సాటి జీవిగదా! అడగడంలో ఆశ్చర్యం లేదుగాని, ఇంతకు ఎవరాయన' కుతూహలాన్ని ఆపుకోలేక అడిగాను.

'మా జి.ఎం.కి పి.ఏ.' అంది.

'ఆతను తమిళుడా!'

'ఆరే ఎలా కనుక్కున్నావ్!' ఆశ్చర్యంగా అంది మృణాళిని.'

'పెద్ద కష్టమేముంది మాట మధ్య పేరుపెట్టి సంభోదించారు గదా మురుగన్ అని' తెలివిగా అన్నాను.

'నువ్వు కవితలేనా లేక కథలు కూడా రాస్తావా!' అడిగిందామె.

'ఎందుకలా అడుగుతున్నావు' వున్నట్టుండి వేసిన ఆమె ప్రశ్న ఆశ్చర్యంలో ముంచింది.

'ఒక స్టోరీ రాయాలి అందుకని.'

'ఎవరిది?' ప్రశ్నించాను.

'ఇప్పుడు కాదు మరోటైమ్‌లో చెబుతాను.' మళ్ళీ మూడ్ మారిపోయింది.

'అదేం కుదరదు. అలా అయితే ఇప్పుడెందుకు చెప్పాలి' మొండిగా అన్నాను.

'నువ్వెంత అడిగినా చెప్పనంటే చెప్పను. సమయం రావాలని చెప్పాను గదా' ఇవిడ జగమొండి.

'ఏమిటో ఈ సస్పెన్స్! అదిసరే సమయానికి గుర్తు చేశారు మంచి ప్లాన్ కూడ తట్టింది. ఈ మురుగన్‌పై ఓ





మేము అతి నూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రనందకరమైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లను తయారించుచున్నాము. మహాశయులు మాకు వేయూతనిచ్చి అత్యధికముగా అర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ అర్డరును వెంటనే గమనించి సప్లయి చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

BHAVANI - 638 301

P. B. No. 38 Phone No. 2465

కథ రాయాలని వుంది' నిర్ణయాత్మకంగా అన్నాను.

'ఏవిటది' ఇంట్రెస్టుగా అడిగింది.

'అది నేనెందుకు చెప్పాలి! ఇదీ సస్పెన్సే!' జవాబుగా అన్నాను.

'ఎలా బిగిన్ చేస్తావు అది చెప్పు చూద్దాం' మళ్ళీ అడిగింది.

'నా కెప్పుడు స్టార్టింగ్ ట్రబుల్ లేదు. ఎటొచ్చీ కంక్లూజన్ గురించే ఆలోచిస్తున్నాను.

♦ ♦ ♦

హాలు నిండినది బోర్డుచూసి జనం ఒక్కొక్కళ్ళే మెల్లగా ఏదో కోల్పోయిన వాళ్ళలా వెళుతున్నారు వెనక్కి. తమ అభిమాన నటుడి సినిమాకి అభిమాన సంఘాలన్నీ ముందే రిజర్వ్ చేసుకొంటారు టిక్కెట్లని మొదటి షోకి! నేను ఏ అభిమాన సంఘంలోనూ సభ్యుడిని కాకపోయినా కొంత మంది మిత్రుల అద్దానిలో ఉండటంతో రెండు టికెట్లు సంపాదించగలిగాను. ఎవరైనా తెలిసిన వాళ్లు వస్తే ఇవ్వొచ్చులే అనుకుని ఓ టిక్కెట్టు అదనంగా కొన్నాను. అంతదాకా చూస్తున్న నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ఎదురుగా మురుగన్ అతడితోపాటు ఇంకొక ఆవిడెవరో వుంది. అతగాడికికూడ టిక్కెట్లు దొరికుండవు అనుకుంటూ దగ్గిరగా వెళ్ళాను. 'హలో' మందలింపుగా నవ్వుతూ అన్నాను.

'హ...హలో' అతడి గొంతులో అనీజి.

'ఏవిటి మీకూ టికెట్ దొరకలేదా?' అన్నాను తెలియనట్టు నటిస్తూ.

'లేదు' ముభావంగా అన్నాడు మురుగన్.

'నా దగ్గర తీసుకొండి ఒకటి' మర్యాదగా అన్నాను.

'ఒకటైతే పర్వాలేదు. కాని నా మిసెస్ కూడా వుంది' మొహంలో ఏదో కాంతి!

టికెట్లు దొరుకుతున్నాయనేమో!

'మీరిద్దరు చాలా ఆశపడి వచ్చారు. నా దగ్గర కూడ సరిగ్గా రెండే వున్నాయి తీసుకోండి' అన్నాను.

'అబ్బే! ఎందుకులెండి' అర్థమనస్కరంగా అన్నాడని తెలుస్తూనే వుంది.

మురుగన్‌గారూ! మీ భార్య పేరు కౌసల్య కదూ!' అన్నాను మాట మారుస్తూ.

'అవునండీ' ప్రక్కనున్న ఆవిడ సమాధానం చెప్పింది!

ఒక్కసారి మిర్రి చూశాడు ఆమెవైపు మురుగన్!

'ముందు టికెట్లు తీసుకోండి! అవతల షో బిగిన్ అయింది కూడా' చేతిలో పెడుతూ చెప్పేను. ఎప్పుడు యిస్తానా అని గుంటనక్కలా కాచుకున్న అతడు గబుక్కున తీసుకుని వెనుదిరిగాడు.

'థాంక్సండీ!' మర్యాద భర్త మర్చినా పాపం ఆవిడ మాత్రం వెనక్కి తిరిగి చెబుతూ అతడిచేయి పట్టుకొని సాగింది. వెళుతూ ఏదో కోపంగా అంటున్న మాటలు తమిళంలో వుండి. అనువాదం చేసుకుని నేను మురుగన్‌ని మళ్ళీ అడగలేను కదా!

*

Regd No. 6233




Phone : 21852

* కలర్ బనియను. * బోరియా. * జెట్టీలు.